క్లుప్తంగా

పదవీవిరమణ చేసిన ఉపాధ్యాయులకు సన్మానం


పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: ఆదోని ఎస్టీయూ రీజియన్ అధ్వర్యంలో ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు వి. శ్రీనివాసులు, ఎన్. రామయ్యను శనివారం ఘనంగా సన్మానించారు. పురపాలక ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పి.నాగేంద్రప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో తల్లిదండ్రులు తర్వాత అంతటి సముచిత స్థానం గురువులకు ఉందన్నారు. పిల్లలకు మంచి క్రమ శిక్షణతో కూడిన విద్యాబోధన అందించినపుడే వారు చిరకాలం గుర్తు పెట్టుకుంటారని తెలిపారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు శేషజీవితాన్ని హాయిగా కుటుంబంతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమములో ఎస్టీయూ నాయకులు వెంకటేశ్వర్లు, నాగరాజు, రామ్మోహన్ రెడ్డి, రమేష్ నాయుడు, వీరచంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

125 మందికి కంటి శస్త్రచికిత్స


ఆపరేషన్లు చేయించుకున్న రోగులతో వామ్, అవోపా సభ్యులు

ఆదోని అర్బన్: గత వారం ఆదోని పట్టణ ప్రపంచ ఆరోగ్య మహాసభ(వామ్) మరియు ఆరోగ్యశ్రీ నంద్యాల శాంతిరామ్ ఆస్పత్రి వారి సహకారంతో ఎస్ఆర్బి కాకుబాళ్ నగేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ శిబిరం నుంచి 125 మంది రోగులు విజయవంతంగా కంటి ఆపరేషన్ చేయించుకొని శనివారం క్షేమంగా ఆదోనికి తిరిగి వచ్చారని ఆదోని పట్టణ వామ్, అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. ఆపరేషన్లు బాగా జరిగాయని, తమకు మందులను కూడా ఉచితంగా అందించారని రోగులు తెలియజేశారు. కార్యక్రమంలో వామ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రఘు, కోశాధికారి యాదగిరి వెంకటేశ్వర్లు, ప్రతాప్ ఈరన్నశెట్టి, సౌజన్యకర్త కాకుబాళ్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వాయుపుత్రుడికి అభిషేక పూజలు



కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుదుములదొడ్డి ఆంజనేయస్వామి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం తదితర పూజలను జరిపించారు. కౌతాళంలో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో కూడ ప్రత్యేక పూజలు జరిగాయి.

రాష్ట్ర ప్రయోజనాలు సాధించాలి


శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు గోవిందు

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర ప్రయోజనాలు సాధించాలని సీపీఎం జిల్లా నాయకులు గోవిందు, హనుమంతు, గురుశేఖర్ కోరారు. పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో శనివారం సీపీఎం డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ బీజేపీకి కేంద్రంలో తగినంత మెజారిటీ లేకపోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీహార్ నితీష్‌కుమార్‌పై ఆధారపడి ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.రాష్ట్ర ప్రయోజనాలు సాధించుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం ఉందని చెప్పారు. సీపీఎం నాయకులు రాముడు, లక్ష్మినర్సయ్య, అబ్దుల్లా, సురేష్, కృష్ణ ,నరసింహులు, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

17న తొలి ఏకాదశి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని అన్నమయ్య సర్కిల్ తిరుమల్ నగర్‌లో వెలసిన శ్రీ వెంకటసాయి దేవాలయంలో ఈనెల 17న తొలిఏకాదశి మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి ఉదయం 10గంటలకు సహస్ర పుష్పార్చన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటలకు ముత్యపుపందిరిలో శ్రీవారి పల్లకీ సేవ నిర్వహిస్తామన్నారు. ఈ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

- భయంతోనే టీడీపీ అసత్య ప్రచారాలు
- అందరికీ అండగా ఉంటా
- ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

మంత్రాలయం : పార్టీ మారే ప్రసక్తే లేదని, టీడీపీ నాయకులు భయంతోనే లేనిపోని ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. శనివారం పెద్దకడబూరు మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను టీడీపీ, బీజేపీ పార్టీలోకి పోతానంటూ ప్రచారం సాగుతోందని, తనకు పార్టీ మారే ఆలోచన లేదన్నారు. ప్రజలు తనపై నమ్మకంతోనే నాల్గో సారి గెలిపించారని ఉద్ఘాటించారు. టీడీపీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో అరాచకాలు సృష్టించిందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధింపులు, దాడులకు పాల్పడడం శోచనీయమన్నారు. ఎమ్మెల్యేగా తనను గెలిపించి రాష్ట్రంలోనే గుర్తింపు తెచ్చారన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటా..

నియోజకవర్గంలో డీలర్ షిప్, మధ్యాహ్న భోజన పథకం, ఉపాధి ఫీల్డు అసిస్టెంట్స్‌లను అధికారులను టీడీపీ నేతలు బెదిరిస్తున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ దౌర్జన్యాలకు ఎవరు అధైర్య పడవద్దని, అండగా ఉంటానని భరోసా నిచ్చారు. టీడీపీ ప్రభుత్వం మేనిఫెస్టో ప్రకారం తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు పాలనపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. 2014లో రైతు, డ్వాక్రా రుణమాఫీ చెల్లిస్తానని చెప్పి చేతులు ఎత్తివేశారని గుర్తు చేశారు. ఈ సారి కూడా సూపర్ సిక్స్ హామీల అమలు విషయంలో ప్రజలకు నమ్మకం కుదరడం లేదన్నారు. పార్టీ కోసం శ్రమించిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేస్తానని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఏ కష్టం వచ్చినా నాయకులు, కార్యకర్తలు తనను సంప్రదించాలని కోరారు. ప్రతి ఒక్కరు ధైర్యంగా ఉండి టీడీపీ ప్రభుత్వ వైఫల్యాల పై పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రవిచంద్ర రెడ్డి, మండల నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, శివారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రామలింగా రెడ్డి, సర్పంచ్‌లు రామాంజినేయులు, చంద్రశేఖర్, నాయకులు పూజారి ఈరన్న, అయ్యప్ప, షేర్‌ఖాన్ పటేల్, యల్లప్ప, నరసింహులు, జామూకయ్య, మాజీ ఎంపీపీ రఘురామ్, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు సభ్యుడు వజేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భైపాస్ రోడ్డు పనులను పునః ప్రారంభించండి

- భైపాస్ రోడ్డు ఏరియాలో నాకు ఒక్క సెంటు స్థలం కూడా లేదు
- ఉన్నట్లు నిరూపిస్తే ఆ స్థలం పేదలకే పంపిణీ చేస్తా
- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి


మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆగిపోయిన బైపాస్ రోడ్డు పనులను పునః ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సంబంధిత అధికారులను, ప్రస్తుత ఎమ్మెల్యే పార్థసారథిని కోరారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజల ట్రాఫిక్ కష్టాల దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి బైపాస్ రోడ్డును మంజూరు చేయించానని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక చురుగ్గా సాగుతున్న బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయని, వాటిని వెంటనే ప్రారంభించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు. బైపాస్ రోడ్డు ఏరియాలో తనకు ఒక్క సెంటు స్థలం కూడా లేదని, ఒకవేళ ఉన్నట్లు నిరూపిస్తే ఆ స్థలం ఉచితంగా పేదలకే పంపిణీ చేస్తానని చెప్పారు. ఆదోనిలో దశాబ్దాల కాలంగా వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, 7.3 కి.మీ. మేర బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని కోరగా, కేంద్ర ప్రభుత్వం నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.242 కోట్లు విడుదల చేసిందని వివరించారు. స్థల సేకరణ, బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఈ నిధులను ఖర్చు చేయాల్సి ఉందన్నారు.

బాధితులు వివరాలు ఇవ్వనందుకే పరిహారం జమ కాలేదు

తమకు నష్టపరిహారం అందలేదని భూములు కోల్పోయిన కొంత మంది రాద్ధాంతం చేస్తున్నారని, అయితే ఖాతాల వివరాలు అందించాలని అధికారులు రైతులకు విన్నవించినా.. ఇవ్వకపోవడంతోనే పరిహారం జమ కాలేదని మాజీ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఖాతాల వివరాలను త్వరితగతిన అందించి రైతులకు అందాల్సిన నష్టపరిహారాన్ని పొందవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన బైపాస్ రోడ్డు నిర్మాణం పనులను ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పూర్తి చేసి ప్రజల ట్రాఫిక్ కష్టాలను తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఆదోని పట్టణ జనాభా దాదాపు 3,50,000 ఉండగా, వారి ఇబ్బందుల దృష్ట్యా రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొంతమంది రైతులు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో పనులను ఆపడం మంచిది కాదన్నారు. ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా పనులు చేసి మన్ననలు పొందాలని హితవు పలికారు.

దళిత మహిళను హత్య చేయడం దారుణం


మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న

ఆదోని రూరల్: మండలంలోని నాగనాథనహళ్లి గ్రామంలో ఈనెల 12వ తేదీన దళిత మహిళ గుండమ్మను ట్రాక్టర్‌తో తొక్కించి చంపడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న తెలిపారు. హత్యకు పాల్పడిన వారు టీడీపీ వర్గీయులుగా భావిస్తున్నారని, అగ్రవర్ణాలకు చెందిన రాఘవేంద్రరెడ్డి, శ్రీధర్‌రెడ్డితో పాటు మరో ఇద్దరిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. అధికారం ఉంది.. ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందనే ధీమాతో దళిత మహిళపై ఇలాంటి దారుణానికి ఒడి కట్టడం సరైనది కాదన్నారు. ఇలాంటి హత్యలను టీడీపీ కూటమి ప్రభుత్వం ఖండించాలని, హంతకులను కఠినంగా శిక్షించాలన్నారు. భూ వివాదాలు ఆదోని నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నాయని, గత రెవెన్యూ అధికారుల వైఫల్యమే ఇందుకు కారణమని విమర్శించారు. ఇలాంటి భూ సమస్యలను రెవెన్యూ అధికారులు, పోలీసు యంత్రాంగం జోక్యం చేసుకొని సామరస్యంగా పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, మండల కార్యదర్శివర్గ సభ్యులు రామాంజనేయులు, పట్టణ నాయకులు కృష్ణమూర్తి, వెంకటేష్, మండల నాయకులు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళను హత్య చేసిన వారిని శిక్షించాలి

గోనెగండ్ల : ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో దళిత మహిళ మాల గుండమ్మను ట్రాక్టర్‌తో తొక్కించి హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ మాల గుండమ్మను పొలం విషయంలో హత్య చేయడం చాలా బాధకరమని, దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పురుషోత్తం రెడ్డిని కూడా దారుణంగా చితకబాదడం దారుణమని మండిపడ్డారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని దళిత మహిళను హత్య చేసిన రాఘవేంద్ర రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సుబ్బారెడ్డి, అతని అనుచరులను వెంటనే అరెస్టు చేసి, వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కఠినంగా శిక్షించాలి

కోసిగి: ఆదోని మండలం నాగనాథన హళ్లి గ్రామంలో దళిత మహిళ గుండమ్మ దారుణంగా హత్య చేసిన అగ్రకులాల వారిని కఠినంగా శిక్షించాలని ఎంఎస్పీ జిల్లా నాయకులు దుర్గప్ప మాదిగ, ఎమ్మార్పీఎస్ తాలుకా కన్వీనర్ నాగరాజు మాదిగ డిమాండ్ చేశారు. శనివారం కోసిగిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సామేల్ మాదిగ, అధికార ప్రతినిధి నరసింహులు మాదిగల సమక్షంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గుండమ్మ పొలం విషయంలో అగ్రకులస్తులు ట్రాక్టర్‌తో ఢీకొట్టి, తొక్కించి అతి దారుణంగా హత్య చేయడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునారావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు హనుమంతు, ఉరుకుందు, నరసయ్య, నరసింహులు, మూకయ్య, వెంకటేష్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

డప్పుకళాకారుడిపై దాడి

ఆదోని అర్బన్: పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన డప్పు కళాకారుడు లక్ష్మన్నపై శుక్రవారం రాత్రి దాడి జరిగింది. బాధితుడు లక్ష్మన్న పోలీసులకు తెలిపిన మేరకు వివరాలు.. పట్టణంలోని చౌదరి బావి సమీపంలో పీర్ల పండగ సందర్భంగా డప్పు కొట్టిన తరువాత తోటి కళాకారులతో కలసి వాల్మీకి నగర్ నుంచి ఇంటికి వెళ్తుండగా.. కొంతమంది యువకులు డప్పు కొట్టాలని, తాము డాన్స్ చేస్తామని చెప్పడంతో మరలా డప్పు కొట్టారు. రాత్రి ఆలస్యమవడంతో వెళ్తామంటే.. వెళ్లకూడదు డబ్బు కొట్టాల్సిందే అంటూ బోయ శేఖర్ అనే వ్యక్తి లక్ష్మన్నపై దాడి చేశాడు. వెంటనే తోటి కళాకారులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడిచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ప్రశాంత్ కాలనీకి చెందిన లక్ష్మన్న అనే డప్పు కళాకారుడిపై దాడి చేసిన బోయ శేఖర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ తేజమూర్తి శనివారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం రాత్రి వాల్మీకినగర్ మీదుగా ఇంటికి వెళ్తున్న కళాకారుడు బోయ శేఖర్‌పై పిలిచి డప్పు వాయించాలని, బోయ శేఖర్ చెప్పగా ఒప్పుకోకపోవడంతో కళాకారుడిపై దాడి చేశారన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోయ శేఖర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


చికిత్స పొందుతున్న డప్పు కళాకారుడు లక్ష్మన్నను పరామర్శిస్తున్న కేవీపీఎస్ నాయకులు

దాడి చేసిన వారిని శిక్షించాలి

ఆదోని రూరల్: డప్పు కళాకారుడు లక్ష్మన్నపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.తిక్కప్ప, పట్టణ కార్యదర్శి నాగేంద్ర డిమాండ్ చేశారు. ఆదోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మన్నను శనివారం పరామర్శించి, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన డప్పు కళాకారుడు లక్ష్మన్న శుక్రవారం రాత్రి పీర్ల పండగ సందర్భంగా డప్పు కొడుతున్న సందర్భంలో బోయ శేఖర్, బోయ బుడ్డ కృష్ణలు కులం పేరుతో దూషించి కట్టెలతో దాడి చేశారన్నారు. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో లక్ష్మన్న చికిత్స పొందుతున్నాడన్నారు. అగ్రవర్ణాల వారు దాడులకు తెగబడడం బాధాకరమని, వెంటనే వారిపై పోలీసులు కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. కేవీపీఎస్ నాయకులు మునిస్వామి, కృష్ణమూర్తి, పరమేష్, నాయకులు గోపాల్, లింగన్న, తిప్పన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

ఏబీవీపీ నూతన నగర కమిటీ ఎన్నిక

ఆదోని అర్బన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆదోనిశాఖ ఆధ్వర్యంలో శనివారం నూతనంగా నగర కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో నగర కార్యదర్శిగా సి.వీరేష్, నగర సహాయ కార్యదర్శిగా ఉమామహేష్, గోవిందరాజులు, ముకేష్ సంతోష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటరమణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎర్రిస్వామి పాల్గొన్నారు. దేశానికి సేవ చేసిన ప్రముఖులైన స్వామి వివేకానంద, అంబేడ్కర్, భగత్‌సింగ్ జ్యోతిరావు పూలే ఆశయాలను సాధించాలని పిలుపునిచ్చారు.

నిందితులను అరెస్టు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): దళిత మహిళ గుండమ్మను హత్య చేసిన రాఘవేంద్రరెడ్డి, అతని అనుచరులను తక్షణమే అరెస్టు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సి.మహేష్ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని మండలం నాగనాథహళ్లికి చెందిన గుండమ్మ.. రాఘవేంద్రారెడ్డి సంబంధీకుల భూములను కొనుగోలు చేసిందన్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని రాఘవేంద్రరెడ్డి దౌర్జన్యంగా పొలంలోకి వెళ్లి గుండమ్మను ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్యచేశారన్నారు. నిందితులను అరెస్టు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, దావీదు, సురేంద్ర, లక్ష్మి, సుధాకర్, ప్రేమ్‌రాజ్, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాల లీజుపై అవగాహన


వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు

ఆదోని టౌన్: ఆదోని ఆర్టీసీ డిపో పరిధిలో ఖాళీగా ఉన్న 1.30 ఎకరాల ఖాళీ స్థలం లీజుపై శనివారం డిపోలో డీఎం రఫిక్‌అహ్మద్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో పట్టణంలోని వ్యాపారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసులు, ఈఈ ఈశ్వరయ్య, అసిస్టెంట్ మేనేజర్ రాఘవేంద్ర వ్యాపారులకు అవగాహన కల్పించారు. డిపో పరిధిలో 1.30 ఎకరాలు ఖాళీ స్థలం ఉందని జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసులు తెలిపారు. ఈ స్థలాన్ని లీజుకు ఇవ్వనున్నామని, వ్యాపారులకు ఏయే ప్రాంతం అనుకూలంగా ఉంటుందో చూసుకుని లీజు పొందవచ్చని చెప్పారు. తొందరలోనే వ్యాపారులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి

- కూతురికి గాయాలు

కర్నూలు: స్థానిక బళ్లారి చౌరస్తా అంబికా మెటల్ స్టోర్స్ వద్ద చిరు వ్యాపారం నిర్వహించుకుంటున్న సోమేశ్వరమ్మ (52) రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. శుక్రవారం రాత్రి వ్యాపారం ముగించుకుని కూతురు ప్రశాంతితో కలిసి వీకర్ సెక్షన్ కాలనీలోని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా పెద్దపాడు వైపు నుంచి గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి తల్లీకూతుళ్లను ఢీకొంది. ప్రమాదంలో సోమేశ్వరమ్మ అక్కడికక్కడే మృతి చెందగా ప్రశాంతికి రక్త గాయాలయ్యాయి. ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు చేయించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు ఆచూకీ తెలిసినవారు కానీ, ఆ సమయంలో ఘటనా స్థలం వద్ద ఉండి ఫొటోలు కానీ, వీడియో కానీ తీసివుంటే 90003 34894/98482 20844 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ట్రాఫిక్ సీఐ గౌతమి విజ్ఞప్తి చేశారు.

వర్షం కోసం పూజలు


మారెమ్మ దేవాలయంలో పూజలు చేసేందుకు నీటిని తీసుకువస్తున్న గ్రామస్తులు

గోనెగండ్ల: వర్షాలు కురువకపోవడంతో సాగుచేసిన పంటలు ఎండిపోతుండడంతో శనివారం మండల కేంద్రం గోనెగండ్లలో రైతులు, గ్రామస్తులు, యువకులు గ్రామంలోని దేవాలయాల్లోని దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. సుంకులమ్మ, మారెమ్మ, చింతలాముని, నల్లారెడ్డి స్వాములు, ఆంజనేయ స్వామి, ఈశ్వర దేవాలయాల్లోని దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని బావుల నుంచి బిందెలతో నీటిని తీసుకువచ్చి ఆలయాల ముఖద్వారాల వద్ద పోసి, పూజలు నిర్వహించారు. అలాగే మారెమ్మ, సుంకులమ్మ దేవతలకు నైవేద్యం, పూలు, టెంకాయలు సమర్పించి వర్షం కురిపించాలని వేడుకున్నారు. పూజలు మరో నాలుగు రోజుల పాటు గ్రామంలోని అన్ని దేవాలయాల్లో చేయనున్నట్లు రైతులు తెలిపారు.

టీకాలతో పిల్లల ప్రాణాలకు రక్ష


చిన్నారికి టీకా వేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): క్రమం తప్పకుండా గర్భిణులకు, చిన్నారులకు టీకాలు వేయడం వల్ల వారి ప్రాణాలకు రక్ష ఉంటుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం శరీన్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని సవారితోట, ఐటీసీ కంపెనీ సచివాలయాల్లో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గర్భిణులకు, చిన్నారులకు ఇచ్చిన టీకాల వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆగస్టు 31వ తేదీ వరకు జరగబోయే స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ప్రతి పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో తప్పనిసరిగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచుకుని డయేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలను చదివిద్దాం కార్యక్రమంలో భాగంగా ఇద్దరు ఆడపిల్లలున్న తల్లిని సన్మానించారు. ఆడపిల్లలపై వివక్ష చూపకుండా పాపైనా, బాబు అయినా సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఫర్వీన్ తబస్సుమ్, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత, డీపీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు పోరాడండి


ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొత్తకాపు మధుసూదన్‌రెడ్డి

దేవనకొండ: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేలా ఒత్తిడి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ట్రెజరీ ప్రధాన కార్యదర్శి కొత్తకాపు మధుసూదన్‌రెడ్డి కోరారు. శనివారం మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ తరపున ఆలూరు నుంచి బి.విరూపాక్షి, మంత్రాలయం నుంచి బాలనాగిరెడ్డి ఎమ్మెల్యేలుగా గెలుపొందారన్నారు. కర్నూలు జిల్లా అభివృద్ధి, జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా పోరాడాలని కోరారు. ఎంపీటీసీ నామాల శ్రీనివాస్, వైస్ సర్పంచ్ వీరన్న, పురుషోత్తంరెడ్డి, చాకలి తిమ్మప్ప, దుమ్ము హనుమంతు, చంటి పాల్గొన్నారు.

పట్టుబడిన కర్ణాటక మద్యం ధ్వంసం

- అక్రమంగా మద్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తాం
- సెబ్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వినోద్‌కుమార్


పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న సెబ్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వినోద్‌కుమార్


మద్యాన్ని ట్రాక్టర్‌తో ధ్వంసం చేయిస్తున్న సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్

ఆదోనిరూరల్: ఆయా కేసుల్లో పట్టుబడిన మద్యాన్ని శనివారం స్థానిక ఇస్వీ రోడ్డులో సెబ్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. పట్టుబడిన మద్యాన్ని వాహనంతో తొక్కించి ధ్వంసం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 70 కేసుల్లో అక్రమ కర్ణాటక మద్యం, నాటుసారా తయారీదారుల నుంచి పట్టుకున్న నాటుసారాతో కలిపి 696 లీటర్ల మద్యం పట్టుకున్నట్లు తెలిపారు. ఇందులో 111 లీటర్ల నాటుసారా కూడా ఉందని, మొత్తాన్ని వాహనంతో ధ్వంసం చేయించి నాశనం చేసినట్లు చెప్పారు. ఎవరైనా కర్ణాటక మద్యం సరఫరా చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెబ్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు నిఘా వేసి అక్రమ మద్యం కట్టడికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సెబ్ సీఐ విన్నీలత, సిబ్బంది మునిరంగడు, శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ ఎస్.కె.మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: కోసిగి సెబ్ సర్కిల్ పరిధిలోని కోసిగి, పెద్దకడబూరు మండలాల్లో అక్రమంగా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి తరలిస్తుండగా పట్టుబడిన మద్యాన్ని శనివారం అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, సీఐ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. స్థానిక మార్కెట్ యార్డులో పట్టుబడిన మద్యాన్ని ట్రాక్టర్‌తో తొక్కించారు. వారు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు చెందిన 452 లీటర్లు, ఆంధ్రకు చెందిన 3 లీటర్లును ధ్వంసం చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.